

సిఐటియు మహాసభల జయప్రదానికి ప్రచారం



ప్రచారం చేస్తున్న గంగరాజు, తదితరులు

ప్రజాశక్తి -అనంతగిరి : ఈనెల 20, 21తేదీల్లో అల్లూరి జిల్లాలో మొదటిసారిగా నిర్వహిస్తున్న సిఐటియు మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు డి.సి.గంగరాజు మండల కార్యదర్శి కిల్లో మొస్య పిలుపునిచ్చారు. మంగళవారం అనంతగిరి విద్యుత్‌శాఖ కార్మికులు, ములియగుడ మోటార్ ఫీల్డ్ కార్మికులతో కలిసి దినపత్రి ప్రచారం చేశారు. కార్యక్రమంలో మండల అంగన్‌వాడీయూనియన్ నాయకురాలు జి. కళావతి, కార్మికులు పాల్గొన్నారు.

వివాదరహితంగా భూముల రీసర్వే

జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి- పాడేరు :వివాదాలకు తావులేకుండా భూముల రీసర్వే ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో భూముల రీసర్వేపై మండల, గ్రామ సచివాలయ సర్వేయర్లుతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వే సందర్భంగా, సర్వే ప్రక్రియ పూర్తయిన తర్వాత చేపట్టాల్సిన చర్యలపై సూచనలు చేశారు. వెరిఫికేషన్ సక్రమంగా జరగాలని స్పష్టం చేశారు. అభ్యంతరాలుంటే తహశీల్దార్లు, మండల సర్వేయర్లు క్షేత్రస్థాయిలో భూమి వద్దకు వెళ్లి పరిశీలన చేయాలన్నారు. ఎఫ్‌ఎంబిని దగ్గర ఉంచుకుని సర్వేయర్లు రీసర్వే చేయాలన్నారు. ఎఫ్ఎంబిపై సర్వేయర్లకు, రెవెన్యూ అధికారులకు అవగాహన ఉండాలన్నారు. మ్యుటేషన్ ల్యాండ్ రికార్డ్‌లో జాయింట్ పట్టాలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విఆర్‌ఒలు, గ్రామ, మండల సర్వేయర్లు, కలెక్టరేట్ ల్యాబ్‌లో వెరిఫికేషన్ చేయాలని సూచించారు. రీసర్వే డేటాను నాణ్యతలు పరిశీలించి, సక్రమంగా ఉన్నాయని నిర్ధారించుకున్నాక తహశీల్దార్ లాగిన్ నుంచి ఆర్‌డిఒ లాగిన్‌కు పంపించాలని ఆదేశించారు. భూముల మ్యుటేషన్ ప్రక్రియను రెవెన్యూ అధికారులు వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ జె. శివశ్రీనివాసు, ఆర్‌డిఒ బి. దయానిధి, ల్యాండ్ సర్వే సహాయ సంచాలకులు వై.మోహనరావు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులకు క్రీడా సామగ్రి



క్రీడాపరికరాలు అందజేస్తున్న సిఆర్‌పిఎఫ్ కమాండెంట్

ప్రజాశక్తి- పెదబయలు : గిరిజన యువత చదువులతో పాటు క్రీడల్లో రాణించాలని, తద్వారా మానసికోల్లాసం వస్తుందని సిఆర్‌పిఎఫ్ 198 బెటాలియన్ కమాండెంట్ రాజేష్ పాండే అన్నారు. సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా పెదబయలు మండలం రూడకోటలో గిరిజన విద్యార్థులకు మంగళవారం సిఆర్‌పిఎఫ్ 198 బెటాలియన్ కమాండెంట్ రాజేష్ పాండే, ఇన్‌స్పెక్టర్ మంజిత్ సింగ్, ముంచంగిపుట్ ఎస్ఐ రవీంద్ర, స్థానిక సర్పంచ్ సురేష్‌కుమార్ ద్వారా క్రీడ సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమాండెంట్ రాజేష్‌పాండే మాట్లాడుతూ, ఏటా సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలోభాగంగా గిరిజనులకు గొడుగులు, రేడియోలు, దుప్పట్లు, క్రీడా సామగ్రి పంపిణీ చేస్తున్నామని, భవిష్యత్తులో అనేక కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో బాబుసాల సర్పంచ్ మఠం బంగారమ్మ, ఎస్ఎస్‌ఐ పోతురాజు, సిఆర్‌పిఎఫ్ బెటాలియన్ సిబ్బంది, రూఢకోట, బాబుసాల, కుమడ, కోరవంగి పంచాయితీల క్రీడాకారులు పాల్గొన్నారు.

'నాడు - నేడు' నిధులతో పాఠశాల భవన నిర్మాణం



శంకుస్థాపన చేస్తున్న జెడ్‌పిటిసి జానకమ్మ, సిపిఎం సర్పంచ్ సునీత

ప్రజాశక్తి డుంబ్రిగూడ: నాడునేడు నిధులు రూ.38లక్షలతో చేపట్టనున్న గసభ పంచాయతీ చిమిలిగూడ నూతన పాఠశాల భవన నిర్మాణాన్ని పాఠశాల విద్యాకమిటీ, ప్రజల భాగస్వామ్యంతో చేపట్టాలని ఆ పంచాయతీ సిపిఎం సర్పంచ్ పి.సునీత అన్నారు. మంగళవారం స్థానిక సర్పంచ్ ఆధ్వర్యంలో జెడ్‌పిటిసి జానకమ్మ నాడునేడు పనులకు శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఇన్నాళ్లు పాఠశాల భవనం లేక ఇబ్బందులు పడిన చిమిలిగూడ విద్యార్థులకు భవన నిర్మాణం పూర్తయితే వసతి కష్టాలు తీరిపోతాయన్నారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి లలిత, ఎంపిటిసి వి జెమ్మ, ఉపసర్పంచ్ కె మహదేవ్, వార్డు సభ్యులు పి.సత్యనారాయణ, మోహన్‌దాస్, మాజీ సర్పంచ్ పి.సురేష్‌కుమార్, సచివాలయ సిబ్బంది, వాలంటీరు, 1పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాలకృత్యాలు తీర్చుకునేందుకు అవస్థలు



మంచులో కాలకృత్యాలు తీర్చుకుంటున్న విద్యార్థులు

ప్రజాశక్తి - పెదబయలు :మండల కేంద్రంలోని వైటిసిలో నాలుగేళ్లుగా నిర్వహిస్తున్న ముంచంగిపుట్టు ఈఎంఆర్ఎస్ ఏకలవ్య నోడల్ వసతి గృహానికి చెందిన 300 మంది విద్యార్థినీ విద్యార్థులు ప్రతిరోజూ కాలకృత్యాలకు నానా అవస్థలు పడుతున్నారు. ఐటిడిఎ అధికారుల ఆదేశాల మేరకు స్థానిక రెసిడెన్సియల్ హాస్టల్‌లో వసతిపొందుతూ, తరగతులకు వేరేచోట హాజరౌతున్న వీరంతా, ఇక్కడ ఉన్న ఒకేఒక చేతిపంపుతో ఉదయంపూట కాలకృత్యాలు తీర్చుకునేందుకు పడుతున్న ఇబ్బందులు చెప్పనలవికాదు. దట్టంగా కురుస్తున్న పొగమంచులో, శీతల గాలులకు వణికిపోతూ, ఉన్న ఒక్కబోరు వద్దే పడిగాపులు పడుతూ, కాలకృత్యాలు తీర్చుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. ఉన్నది ఒకటే బోరు కావడంతో తరచూ మరమ్మతులకు గురౌతోందని ప్రత్నామ్నాయంగా నీటి వసతి కల్పించాలని వీరు పెట్టుకున్న మొర అరణ్యరోదనగానే మిగిలిపోతోందని ఆవేదన చెందుతున్నారు. పొగమంచులో, చలికి వణుకుతూ, చాలాసేపు బోరు వద్ద ఉండడంతో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. నాలుగేళ్లుగా ఇదే పరిస్థితి ఉన్నా ఐటిడిఎ అధికారులకు ఇదంతా ఎందుకు పట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అక్రమ కట్టడాలను అడ్డుకోండి

▸▸ అఖిలపక్ష నేతలు డిమాండ్

ప్రజాశక్తి -హుకుంపేట:ఏజెన్సీ చట్టాలను అతిక్రమించి, మన్యంలో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను ఆదిలోనే గుర్తించి, వాటిని అడ్డుకోవాలని అఖిలపక్ష నేతలు డిమాండ్ చేశారు. నిర్మాణం పూర్తయిన తర్వాత వాటిని సీజ్ చేయడం, ఇతరత్రా చర్యలు తీసుకోవడం వల్ల ప్రయోజనముండదన్నారు కొన్నాళ్ల తర్వాత వాటిని అక్రమార్కులకు అప్పగిస్తున్న ఉదంతాలు పలు చోటుచేసుకున్న నిర్మాణాలను గుర్తించిన వెంటనే కూల్చేయాలని డిమాండ్ చేశారు.



గిరిజనేతరుడి అక్రమ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న నాయకులు

మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో1/70, ఇతర గిరిజన చట్టాలను ఉల్లంఘించి గిరిజనేతరులు అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా చేస్తూనే ఉన్నారని అఖిలపక్ష నేతలు ఆరోపిస్తున్నారు. జీవనోపాధికి, నివాసానికి నిజమైన గిరిజనులు చిన్నపాక వేస్తే ఆగమేఘాలమీద వచ్చి వాటిని అడ్డుకుంటున్న రెవెన్యూ, పంచాయతీ అధికారులు, గిరిజనేతరులు అక్రమంగా నిర్మిస్తున్న బహుళ అంతస్తులనుపట్టించుకోకపోవడంపై విమర్శలు గుప్పిస్తున్నారు. దీనిపై ఫిర్యాదు అందాక, తాత్సారం చేస్తూ విచారణ జరిపి, వాటిని సీజ్ చేస్తున్నారని అంటున్నారు. నిర్మాణాలు అక్రమమని నిర్ధారణ జరిగాక కూల్చేయాలని, లేకుంటే తామే కూల్చేస్తామని అఖిలపక్ష నేతలు హెచ్చరిస్తున్నారు.

అక్రమ నిర్మాణాలపై చట్టపరమైన చర్యలు



ఏజెన్సీ చట్టాలను అతిక్రమించి గిరిజనేతరులు నిర్మాణాలు చేపట్టడం చట్టరీత్యా నేరం. దీనిపై తగు చర్యలు తీసుకుంటాం. మండల కేంద్రంలో బుడ్డకొండమ్మ అనే గిరిజనేతరురాలి అక్రమ నిర్మాణాన్ని సబ్‌కలెక్టర్ ఆదేశాలతో సీజ్ చేసి, అక్కడ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశాం. అక్రమ నిర్మాణాలు చేపడితే ఉపేక్షించబోం.

\- తహశీల్దార్ రాజ్యలక్ష్మి

ఐటిడిఎ పెట్రోల్ బంక్‌ల నిర్వహణకు 22లోగా దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఐటిడిఎ ఆధ్వర్యాన అరకు మండలం పానిరంగిణి, ముంచింగిపుట్టు మండలం లుంగపుట్టు, అనంతగిరి మండలం అనంతగిరిలో ఏర్పాటు చేస్తున్న హెచ్‌పి పెట్రోలు బంక్‌ల నిర్వహణ కోసం ఈనెల 22లోగా దరఖాస్తులు చేసుకోవాలని ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ తెలిపారు. 21 ఏళ్లు నిండి స్థానిక గిరిజన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు సర్వీస్ ప్రొవైడర్‌గా ధరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. పాడేరు ఐటిడిఎ పరిధిలోని స్థానిక గిరిజనులై ఉండాలని, కనీస విద్యార్హత 10వ తరగతి ఉత్తీర్ణత పొంది, ఏదైనా వ్యాపార రంగములో అనుభవము కలిగిన ఔత్సాహిక యువతీ, యువకులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ఎంపికైన అభ్యర్థులు బంక్ పూర్తి నిర్వహణ పెట్టుబడి పెట్టుకోగల ఆర్థిక స్థోమత కలిగి ఉండాలని, ముందుగా ఐటిడిఎకు కనీసం రూ.20 లక్షలు బ్యాంక్ గ్యారెంటీ ఇవ్వాలని సూచించారు. అలాగే బంక్ నిర్వహణ, కావాల్సిన సిబ్బందిని నియమించుకుని, వారి జీతభత్యాలను చెల్లించుకోవాలన్నారు. ఎంపికైన అభ్యర్థికి (సర్వీస్ ప్రొవైడర్) నెలకు రూ.30 వేలు జీతం చెల్లిస్తామన్నారు. జరిగే వ్యాపారాన్ని బట్టి షరతులతో కూడిన ఇన్సెంటివ్ వుంటుందని, ఒక అభ్యర్థికి ఒక పెట్రోలు పంపు మాత్రమే కేటాయిస్తామన్నారు.ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 18 నుంచి ఐటిడిఎ కార్యాలయంలో తిరిగి చెల్లించని రుసుము రూ.1,000 చెల్లించి దరఖాస్తు పొందవచ్చన్నారు. పూర్తిచేసిన దరఖాస్తులను 22వతేదీ సాయంత్రం 5 గంటల లోగా ఐటిడిఎ పిఒ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

మెరుగైన వైద్యం అందించండి

ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ



కెజిహెచ్ గైనిక్ వార్డులో గిరిజన రోగులతో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: కెజిహెచ్‌కు వచ్చే గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని పాడేరు ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ సూచించారు. మంగళవారం కెజిహెచ్‌లోని ట్రైబల్ సెల్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా గిరిజన ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని కెజిహెచ్ వైద్యాధికారులకు సూచించారు. అనంతరం గైనిక్ వార్డులో పర్యటించి అక్కడ గిరిజనులకు అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. గిరిజన మహిళలతో మాట్లాడి పూర్తిగా కోలుకోనేంత వరకు కెజిహెచ్‌లోనే ఉండి వైద్యం పొందాలని సూచించారు. కెజిహెచ్ ట్రైబల్ సెల్‌కు మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో కెజిహెచ్ సూపరిండెంట్ డాక్టర్ మైథిలి, ఆర్ఎంఒ డాక్టర్ వాసుదేవరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా జిల్లా నాయకులు పద్మావతి

గరికపాటి బహిరంగ క్షమాపణ చెప్పాలి : ఐద్వా

ప్రజాశక్తి-విఆర్.పురం

మహిళలను కించపరుస్తూ మాట్లాడిన ప్రవచనకారుడు గరికపాటి నరసింహారావు వెంటనే మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా నాయకులు ఐ.పద్మావతి, విఆర్.పురం మండల అధ్యక్షులు, ఎంపిపి కారం లక్ష్మి డిమాండ్ చేశారు. ఐద్వా విఆర్.పురం మండల కమిటీ సమావేశం రేఖపల్లి సిపిఎం కార్యాలయంలోని మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో లక్షలాది మంది ప్రజానీకాన్ని ప్రభావితం చేస్తున్న గరికపాటి నరసింహారావు ఇటీవల కాలంలో పదేపదే ఆడవాళ్ళ అవయవాలు, ఆధునిక దుస్తులను అసభ్యకరంగా వర్ణిస్తూ చేసిన వ్యాఖ్యలను తీవ్ర ఖండించారు. గరికపాటి నరసింహారావు వ్యాఖ్యల్లో మనుధర్మ శాస్త్రం కనిపిస్తుందని, మహిళల అభివృద్ధికి ఆటంకం కలిగించే విధంగా ఉందని పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి మాయావతిని, ఆమె యొక్క శరీరాన్ని ఏనుగుతో పోలుస్తూ మహిళ అని చూడకుండా అవహేళన చేయడం చట్టరీత్య నేరమని తెలిపారు. గరికపాటి చేసిన వ్యాఖ్యలు అఘాయిత్యాలకు పాల్పడుతున్న నిందితులను సమర్ధిస్తున్నట్లు ఉన్నాయన్నారు. ఇటువంటి వ్యాఖ్యలు ఎవరు చేసినా చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. తక్షణమే ఆయన తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. మహిళా కమిషన్ జోక్యం చేసుకొని విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మహిళా సంఘాలుగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి సున్నం పార్వతీ, కట్టా లక్ష్మి, వెట్టి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

భవనాల నిర్మాణం త్వరితగతిన పూర్తి

ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే ఆదేశం

ప్రజాశక్తి - రంపచోడవరం

గిరిజన సంక్షేమ శాఖ ద్వారా నిర్మిస్తున్న వివిధ భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే సంబంధిత ఇంజనీర్లను ఆదేశించారు. మంగళవారం ఆయన తన ఛాంబర్‌లో గిరిజన సంక్షేమ శాఖ ద్వారా నిర్మిస్తున్న భవనాలపై సంబంధిత ఇంజనీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఐటీడీఏ పరిధిలో ఉన్న ఏడు మండలాలలో నాబార్డ్, సిసిడిపి నిధులతో నిర్మిస్తున్న భవనాల ప్రగతిని సమీక్షించారు. నాబార్డ్, సిసిడిపి నిధులు ఎంత వచ్చింది ఎంత ఖర్చయింది, ఇంకా ఎంత నిధులు అవసరమో తదితర వివరాలపై మండలాల వారీగా ఆరా తీశారు. కల్వర్టులు, గొడౌన్లు. తదితర భవనాలకు ఇసుక, సిమెంటు, మెటల్ ఎక్కడ నుండి కొనుగోలు చేస్తున్నారో, వాటి ఖరీదు ఎంత తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. గుడిసె పర్యటక ప్రాంతంలో నిర్మిస్తున్న భవనాలు, బొదులూరు గ్రామంలో నిర్మిస్తున్న గొడౌన్ రాజవొమ్మంగి, అడ్డతీగల మండలాల్లో నిర్మిస్తున్న కల్వర్టులు ఈ దశలో ఉన్నాయో ఆరా తీశారు. గిరిజన సంక్షేమ శాఖ నిర్వహిస్తున్న భవనాలన్నింటికీ కరెంటుతో సహా మౌలిక సదుపాయాలు పక్కాగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఏజెన్సీలోని ఎంపిక చేసిన ప్రదేశాలలో హాట్ బజార్లు ఏర్పాటుకు ఎక్కడెక్కడ ఎంపిక చేశారో అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.డేవిడ్ రాజ్, అసిస్టెంట్ ఇంజనీర్లు సత్యనారాయణ, నాగరాజు, మహేశ్వరరావు, వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితునికి సిపిఎం సహాయం

ప్రభుత్వం ఆదుకోవాలి : కిరణ్



బాధిత కుటుంబానికి నిత్యావసరాలు అందజేస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి కిరణ్ తదితరులు

ప్రజాశక్తి- చింతూరు

మండలంలోని పేగా పంచాయతీ పరిధి నారకొండ గ్రామంలో సోడే ఎర్రయ్య ఇల్లు అగ్ని ప్రమాదంలో కాలి బూడిదైన సర్వం కోల్పోవడంతో ఆయన కుటుంబాన్ని సిపిఎం నాయకులు మంగళవారం పరామర్శించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి బి.కిరణ్, మండల నాయకులు బాధితునితో మాట్లాడి అగ్ని ప్రమాద నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి 50 కేజీల బియ్యం, రెండు దుప్పట్లు, తువ్వాల, లుంగీ, వంట పాత్రలు, భోజనం ప్లేట్లు, గ్లాసులు, సోలార్ లాంతరు, ఇతర సామాగ్రి అందించారు. అనంతరం కిరణ్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎర్రయ్య కుటుంబానికి తక్షణ ఆర్థికసాయం అందించాలని ఆదుకోవాలని కోరారు. అగ్ని ప్రమాదంలో ఎర్రయ్య కుటుంబం ఆధార్ కార్డులు, రేషన్‌కార్డులు ఉపాధి హామీ జాబ్ కార్డు, బీరువాలో ఉన్న భూమిహక్కు పట్టాలు, బ్యాంకుపుస్తకాలు, బట్టలు, తిండి గింజలు సర్వం అగ్నికి ఆహుతయ్యాకని తెలిపారు. ప్రభుత్వం ఇల్లు నిర్మించి ఇవ్వాలని, కుటుంబం గడవడం కోసం మూడు నెలలకు సరిపడా నిత్యవసర వస్తువులు ఉచితంగా అందించాలని, తక్షణ సహాయం కింద రూ.50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దాతలు ముందుకొచ్చి సహాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి సీసం సురేష్, నాయకులు కుంజా సీతారామయ్య, పల్లపు వెంకట్, ఎర్రంశెట్టి శ్రీనివాస్, మల్లం సుబ్బమ్మ, సవలం కన్నయ్య, కంగాల రంగయ్య, మడకం కన్నయ్య, కంగాల చంటి, పాల్గొన్నారు.

గిరిజనులను నిరాశపరిచిన వైద్య శిబిరం

- అన్ని వ్యాధులకు వైద్య సేవలని ప్రచారం
- నేత్ర వైద్య పరీక్షలు మాత్రమే నిర్వహణ
- ఇబ్బంది పడ్డ మారుమూల ప్రాంతాల ఆదివాసీలు



నేత్ర పరీక్షలు చేస్తున్న ఎల్‌వి.ప్రసాద్ ఆసుపత్రి వైద్యులు

ప్రజాశక్తి- సీలేరు

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ఎల్వీ ప్రసాద్ కంటి ఆధ్వర్యంలో జీకే వీధి మండలం దారకొండలో మంగళవారం నిర్వహించిన వైద్య శిబిరం గిరిజనులను తీవ్ర నిరాశకు గురిచేసింది. అన్ని వ్యాధులకు సంబంధించిన వైద్య నిపుణులు శిబిరంలో పాల్గొంటారని ముందస్తుగా ప్రచారం విస్తృతంగా చేసినప్పటికీ ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి నుంచి నేత్ర వైద్య నిపుణులు మాత్రమే రావడంతో గిరిజనులు కంగుతిన్నారు. వైద్య శిబిరంలో వైద్య సేవలు పొందవచ్చని ఎంతో ఆశగా సుదూర మారుమూల ప్రాంతాల నుంచి కాలినడకన వచ్చిన గిరిజనులకు ప్రయాసే మిగిలింది. దూర ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనులు తీవ్ర ఇబ్బంది పడ్డారు.

150 మంది నేత్ర పరీక్షలు

ఈ శిబిరంలో 150 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 20 మందిని ఆపరేషన్లు నిమిత్తం విశాఖపట్నం ఎల్వి ప్రసాద్ కంటి ఆస్పత్రికి రిఫరల్ చేశారు. దారకొండ ప్రభుత్వ ఆసుపత్రి వైద్య అధికారి నాగభూషణం రోగులకు వివిధ వైద్య పరీక్ష నిర్వహించారు. వైద్య శిబిరంలో కంటి వైద్య నిపుణులు వెంకటరమణ, లతా, మానస, శ్రావణి, లోకేష్ టీం కోఆర్డినేటర్ స్వాములు ఫీల్డ్ ఆఫీసర్లు సత్యనారాయణ గాంధీ సంతోషి, స్థానిక ఎస్ఐ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని స్థానిక సీఐ ఆర్ రవికుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని చికిలింత పంచాయితీ పెదగర్రంగి గ్రామ యువతకు వాలీబాల్ కిట్లును సిఐ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో చదువుకున్న యువత చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి కనబరచాలని సూచించారు. యువత చెడు అలవాట్లకు, చెడు మార్గాలకు దూరంగా ఉండాలని, గ్రామాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్డంగి ఎస్ఐ షరీఫ్, పోలీస్ సిబ్బంది, యువత పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు డిఎవి విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - సీలేరు

జీకే వీధి మండలం సీలేరు డిఎవి పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి కబడ్డీ, ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పాడేరులో నిర్వహించిన బాలుర ఖోఖో పోటీల్లో డిఎవికి చెందిన ఎస్‌కె.అమీర్ బాషా, ఎస్‌కె ఆషిక్, కబడ్డీ పోటీల్లో కె.నవీన్, కె.హేమంత్ అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం ఎంపికైన విద్యార్థులను, క్రీడల్లో శిక్షణ ఇచ్చిన పిఈటి కమలాకరణ్‌ను ఏపీ జెన్కో ఎస్ఈ (పాఠశాల ఎల్ఎంసి చైర్మన్) కెకెవి. ప్రశాంత్ కుమార్, ఈఈ జాకీర్ హుస్సేన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామచంద్రరావు, ఉపాధ్యాయులు, అభినందించారు. అనంతరం హెచ్ఎం రామచంద్రరావు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లోనూ తమ సత్తా చాటి సీలేరు డిఎవి పాఠశాలకు పేరు తీసుకొస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.



ఎంపికైన విద్యార్థులతో ఎపి జెన్‌కో అధికారులు, పాఠశాల హెచ్‌ఎం తదితరులు


పాఠశాలను నిర్వహిస్తున్న చర్చి ఇదే

బడిగా మారిన చర్చి!
గత్యంతరం లేని పరిస్థితుల్లో పాఠశాల నిర్వహణ
గ్రామస్తులు నిర్మించిన పాకలన్నీ శిథిలావస్థకు...

ప్రజాశక్తి హుకుంపేట: మండలంలోని పలు పాఠశాలలకు సొంత భవనాలు లేక అనేక చోట్ల ఆరుబయట విద్యాబోధనలు సాగుతోంది. ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తున్నామని ప్రకటిస్తూ, అనేక పథకాల ద్వారా వసతి కల్పనకు చర్యలు చేపడున్నప్పటికీ, మారుమూల గ్రామాల్లో నేటికీ అవి కార్యరూపం దాల్చడం లేదు. ఫలితంగా అనేకచోట్లు ఇళ్లు, వరండాలు, చెట్టునీడల్లో బడిని నిర్విహిస్తుండగా, మండలంలోని మెరకచింత పంచాయతీ కరకపుట్టులో చర్చి విద్యాబోధనకు వేదికగా మారింది. దీనికీ సుదీర్ఘ కథ ఉందంటే అతిశయోక్తి కాదు.

మండలంలోని మెరకచింత పంచాయతీ కరకపుట్టు ఎంపిపి పాఠశాలకు ఆవిర్భావం నుంచి సొంత భవనం లేదు. ప్రస్తుతం 13మంది విద్యార్థులున్న ఈ పాఠశాలలను గ్రామస్తులందరి ఆమోదంతో చర్చిలో నిర్వహిస్తున్నారు. అంతకుముందు పూరిగుడిసెలో పాఠశాలను నిర్వహించగా, అది కాస్తా పాడవ్వడంతో చిన్నపాటి పెంకులతో షెడ్ వేశారు. వర్షాలకు అది శిథిలావస్థకు చేరుకోవడం గ్రామస్తుల సహకారంలో రేకుల షెడ్‌ను నిర్మించారు. కొద్దిరోజుల క్రితం గాలీవానకు రేకులు కూడా ఎగిరిపోవడంతో పాఠశాల నిర్వహణకు వసతి లేకుండా పోయింది.దీంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో గ్రామంలోని చర్చిలో పాఠశాల నిర్వహణకు గ్రామస్తులంతా నిర్ణయించారు.ఆదివారం మాత్రమే చర్చిలో ప్రార్థనలు జరుగుతుండగా, మిగిలిన రోజుల్లో ఖాళీగా ఉన్న చర్చిలో అభ్యంతరం లేకపోతే పాఠశాలను నిర్వహించుకోవచ్చని ఉపాధ్యాయులకు సూచించారు. గ్రామస్తులంతా సమ్మతించడం, వేరే గత్యంతరం లేని పరిస్థితుల్లో ఉపాధ్యాయులు తప్పనిసరై ఇపుడు చర్చిలోనే పాఠశాలను నిర్వహిస్తున్నారు. గత కొన్నేళ్లుగా పాఠశాల నిర్వహణకు రకరకాలైన షెడ్‌లను నిర్మిస్తున్నా, కరకపుట్టు పాఠశాలకు పక్కా భవనం నిర్మాణానికి అటు ఐటిడిఎగానీ, విద్యాశాఖగానీ ప్రభుత్వపరంగా చొరవ తీసుకోకపోవడం శోచనీయం. గిరిజన విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని చర్చిలో పాఠశాలనిర్వహణకు సమ్మతించిన ఉపాధ్యాయుడు జె.రమణకుమార్‌కు గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు. ప్రస్తుతం ఇదే పాఠశాలకు నాడునేడు కింద నిధులు మంజూరుకావడంతో త్వరిత గతిన పనులు చేపట్టి పూర్తిచేయాలని, పాఠశాలకు వసతికష్టాలు తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.

గిరిజనులకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి - డుంబ్రిగూడ: మండలంలోని బొందుగూడ, పరిసర గ్రామాలకు చెందిన 50మంది నిరుపేద వయోవృద్ధులు, అనాధలకు బండిసాహితీరెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. మంగళవారం ట్రస్ట్ అధినేత బండి అశోకరెడ్డి, సుధావాణి దంపతులుఆయా గ్రామాలకు వెళ్లి వీటిని అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక మండల కోఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్ బికె.నాయుడు మాట్లాడుతూ నిరుపేద గిరిజనులకు సాహితీరెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ అందిస్తున్న సేవలు అభినందనీయమని, మరింత మందికి ట్రస్టు ద్వారా చేయూతనందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కోశాధికారి పి ఇంద్రసేన రెడ్డి, తారకరామ ఆర్గానిక్ యూనిట్ యాజమాన్యం, గిరిజనులు పాల్గొన్నారు.


గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న సుధావాణి తదితరులు

బిర్సా ముండాకు ఘన నివాళి


పాడేరులో నివాళులర్పిస్తున్న ఎపిఒలు

ప్రజాశక్తి-యంత్రాంగం

పాడేరు టౌన్: భగవాన్ బిర్సా ముండా తెచ్చిన సాంఘిక, సాంస్కృతిక విప్లవం గిరిజనుల జీవితాలనుఎంతగానో ప్రభావితం చేసిందని ఐటిడిఎ ఎపిఒలు విఎస్.ప్రభాకరరావు, ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం ఐటిడిఎ సమావేశ మందిరంలో బిర్సాముండా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో బిర్సా ముండాకు విశిష్ట స్థానం ఉందన్నారు. కేవలం పాతికేళ్ల వయసులో బిర్సాముండా చేసిన త్యాగాలు, సాధించిన విజయాలు అసామాన్యమైనవన్నారు. ఆయన జరిపిన పోరాటాల వల్లనే బ్రిటిష్ పాలకులు గిరిజనుల భూహక్కులను గుర్తిస్తూ చట్టాలు చేశారన్నారు.కార్యక్రమంలో ఐటిడిఎ పరిపాలన అధికారి హేమలత, తదితరులు పాల్గొన్నారు.

పెదబయలు : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జనజాతీయ గౌరవ దివస్ నిర్వహించారు ఈసందర్భంగా బిర్సాముండా చిత్రపటానికి ఎంపిపి బి.వరాలమ్మ పూలమాల వేసి నివాళులర్పించారు. ఆదివాసీ గిరిజన చట్టాల కోసం ముండా చేసిన సేవలు ఆదర్శనీయమని, ఆయన ఆశయసాధనకు కృషి చేద్దామని ఎంపిపి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల పరిషత్ అడ్మినిస్ట్రేషన్ అధికారి ఎల్.పూర్ణయ్య, ఇఒపిఆర్‌డి నర్సింగరావు, పిఎసిఎస్ ఛైర్మన్ గంపరాయి వెంకయ్య పాల్గొన్నారు.

జిమాడుగుల : మండల కేంద్రంలోని జిటిడబ్ల్యు పాఠశాలలో బిర్సా ముండా 148వ జయంతిని ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ బిర్సాముండా స్ఫూర్తిగా తీసుకొని ఆదివాసీలంతా హక్కులను పరిరక్షించుకోవాలని, అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని హెచ్‌ఎం సూచించారు.కార్యక్రమంలో అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బోయిపల్లి సింహాచలం పాల్గొన్నారు.

చింతూరు : స్వాతంత్ర్య సమరయోధుడు, గిరిజన హక్కుల కోసం పోరాడిన బిర్సా ముండా జయంతి వేడుకలను స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర విభాగ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్నమాణిక్యం మాట్లాడుతూ బిర్సాముండా గిరిజన హక్కులను కాపాడేందుకు బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాటం చేసి స్వాతంత్ర్య పోరాటానికి ప్రేరణగా నిలిచారని కొనియాడారు. వైస్ ప్రిన్సిపాల్ జి.వెంకటరావు మాట్లాడుతూ జార్ఖండ్ అటవీ ప్రాంతంలో ఉద్యమానికి సారథ్యం వహించి అతిపిన్న వయసులోనే యోధునిగా గుర్తింపు పొందిన బిర్సాముండా జయంతిని జన జాతీయ గౌరవ్ దివస్‌గా జరుపుకోవడం రాబోవు తరాలకు ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఎం.శేఖర్, డాక్టర్ వై.పద్మ, కె శైలజ, కె శ్రీదేవి, రాజబాబు, ఆర్ మౌనిక, పి గౌతమి, రమేష్, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

కొయ్యూరు : మండలంలోని మంప ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో జన్ జాతీయ గౌరవ దివాస్ కార్యక్రమంలో భాగంగా బిర్సా ముండా జయంతోత్సవాలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల నుండి అల్లూరి పార్క్ వరకు ర్యాలీ నిర్వహించి, అల్లూరి సీతారామరాజు, గాము గంటందొర, మల్లుదొర విగ్రహాల వద్ద మన్యవీరులందరికీ ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మంప గ్రామ సర్పంచ్, వీఆర్వో, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


పెదబయలులో ఎంపిపి నివాళి


కొయ్యూరులో....

కుష్టువ్యాధిపై గ్రామాల్లో సర్వే

ప్రజాశక్తి డుంబ్రిగూడ: కుష్టువ్యాధిగ్రస్తులను గుర్తించి, వ్యాధి నివారణకు అవసరమైన చర్యలు చేపట్టేందుకు మండలంలోని గ్రామాల్లో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, గ్రామ వాలంటీర్లు ప్రత్యేక సర్వే చేపడుతున్నారు. మంగళవారం మండలంలోని డుంబ్రిగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి పోతంగి పంచాయతీ గ్రామాల్లో హెల్త్ సూపర్‌వైజర్ రామారావు ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది సర్వే నిర్వహించారు. కుష్టువ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరు తోడ్పాటు అందించాలని కోరారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ ఎస్ స్వామి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.



సర్వే చేస్తున్న పిహెచ్‌సి వైద్యసిబ్బంది


శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్, ఎంపిటిసి

సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి -జిమాడుగుల: మండలంలోని పెదలువ్వాసింగి పంచాయతీ వంచేబు గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక సర్పంచ్ కొండపల్లి సుబ్బలక్ష్మి, ఎంపిటిసి గబ్బాడి సన్యాసిదొర మంగళవారం శంకుస్థాపన చేశారు, ఈ సందర్భంగా సన్యాసిదొర మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి చొరవతో 90 మీటర్లు సిసి రోడ్డు నిర్మాణానికి రూ.2.50లక్షలు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకుడు కొండపల్లి సత్యనారాయణ, ఉపసర్పంచ్ గబ్బాడి గణపతి, మాజీ సర్పంచ్ గబ్బాడి పండు దొర, వార్డు మెంబర్ కిల్లుడు బొంజుబాబు, కోరాబు పండు పడాల్, వాలంటీర్ సాగెని ఏసురత్నం, ఇంజనీరింగ్ సిబ్బంది బాలకృష్ణ పాల్గొన్నారు


వైద్యసేవలందిస్తున్న వైద్యులు

పలుచోట్ల ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్యసేవలు

ప్రజాశక్తి -యంత్రాంగం

డుంబ్రిగూడ: స్థానిక డుంబ్రిగూడ పిహెచ్‌సి, గుంటగన్నెల సచివాలయం పరిధిలోని జాంగూడ గ్రామంలో మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్యశిబిరాన్ని నిర్వహించారు. పిహెచ్‌సి వైద్యాధికారి పి రాంబాబు, 104 వైద్యాధికారి డాక్టర్ సిద్ధార్థ పాల్గొని 59 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందించారు.కార్యక్రమంలో హెచ్ఎన్ రత్నం, ఎంఎల్‌హెచ్ పి ప్రియా, ఎఎన్ఎం భానుమతి, ఆశ కార్యకర్త, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జిమాడుగుల: మండలంలోని వంతల పంచాయతీ కేంద్రంలో మంగళవారం జి.మాడుగుల పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ విఘ్నేష్ ఆధ్వర్యంలోవైద్యశిబిరం నిర్వహించారు. ప్రస్తుత శీతాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గిరిజనులకు సూచనలు చేశారు. రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు.కార్యక్రమంలో గెమ్మలి పిహెచ్‌సి ఈశ్వరమ్మ, వైద్య సిబ్బంది వైసిపి మండల యూత్ ప్రెసిడెంట్ కల్యాణ్ పాల్గొన్నారు

ఎన్ఎంఎంఎస్ ఫీజు గడువు పొడిగింపు

ప్రజాశక్తి - ఆరిలోవ : 2022 -23 విద్యా సంవత్సరంలో జరగనున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ గడువును నవంబరు 25 వరకు పొడిగించినట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ తెలిపారు. మరిన్ని వివరాల కోసం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో గల ప్రభుత్వ పరీక్షల వెబ్ సైట్ www.bse.ap.gov.in ను సంప్రదించాలని సూచించారు.

కంచాల పంపిణీ

ప్రజాశక్తి- భీమునిపట్నం : రెండో వార్డు పరిధి రాయిపాలెం జివిఎంసి ఉన్నత పాఠశాలకు చెందిన బయోలాజికల్ సైన్స్ టీచర్ బి.శైలజ ఆర్థిక సాయంతో పాఠశాల విద్యార్థుల మధ్యాహ్న భోజనానికి రూ.12,500 విలువైన స్టీల్ కంచాలు మంగళవారం అందజేశారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఈశ్వరి దేవి, రమేష్, తదితరులు

గ్రంథాలయాలతో విజ్ఞానం

ప్రజాశక్తి-మారేడుమిల్లి : 55వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయాధికారి రమేష్ ఆధ్వర్యంలో స్థానిక జడ్పీ పాఠశాలలో మంగళవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు అంశాలపై అవగహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎస్.ఈశ్వరి దేవి మాట్లాడుతూ గ్రంథాలయాలు ద్వారా విద్యార్థులకు మంచి విజ్ఞానం లభిస్తుందని చెప్పారు. విద్యార్థులు, యువత ప్రతి రోజూ గ్రంథాలయాలనికి వెళ్లాడం అలవాటు చేసుకోవాలని సూచించారు. గ్రంథాలయాధికారి రమేష్ మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి 20 తేదీ వరకు వారం రోజులు పాటు జరిగే వారోత్సవలో పలు పాఠశాలకు చెందిన విద్యార్థులకు ఆట, పాటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలు పాఠశాల, కళాశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

593వ రోజుకు ఉక్కు జెఎసి దీక్షలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రధాని మోడీ విశాఖ వచ్చినప్పటికీ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయడం లేదని ప్రకటించకుండా, అసలు ఏ విషయమూ చెప్పకుండా మోసగించి వెళ్లిపోయారని సిఐటియు కంచరపాలెం జోన్ ప్రధాన కార్యదర్శి ఒ.అప్పారావు అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు మంగళవారం నాటికి 593వ రోజుకు చేరాయి. దీక్షల్లో సిఐటియు కంచరపాలెం జోన్ నాయకులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ చర్యను నిలుపుదల చేసే వరకు ఉద్యమం కొనసాగుతుందని చెప్పారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయాలని నిర్ణయించడం దుర్మార్గమన్నారు. సుమారు లక్ష మందికి ఉపాధి కల్పిస్తున్న విశాఖ స్టీల్‌ప్లాంట్ ఎన్నో పోరాటాల ఫలితంగా ప్రభుత్వ రంగంలో ఏర్పాటైందన్నారు. ప్లాంట్ మరింత లాభాల్లో నడిచే విధంగా సొంత గనులను కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎస్.రామ్‌గోపాల్, ఒమ్మి అప్పలరాజు, బి.సింహాచలం, ఎం.ఈశ్వరరావు, టి.అప్పలరాజు, ఎ.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సిపిఎంకు రూ.15 వేలు విరాళం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వార్వా, సాహితీ స్రవంతి నాయకులు కీర్తిశేషులు ఎవి.రమణారావు ద్వితీయ వర్థంతి సందర్భంగా ఆయన సతీమణి ఎవి.పద్మావతి, కుమారులు కలిసి సిపిఎం మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావుకు రూ.15 వేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా కష్ణారావు మాట్లాడుతూ రమణారావు, ఆయన సతీమణి పద్మావతి సిపిఎం పార్టీలోనూ, ప్రజా సంఘాల్లోనూ చురుకుగా పనిచేస్తూ వందలాది మందిలో చైతన్యం నింపారన్నారు. రమణారావు ఆకస్మిక మరణం సిపిఎం పార్టీకి, ప్రజాసంఘాలకు తీరని లోటు అన్నారు. పార్టీ కోసం, ప్రజా సంఘాల కోసం ప్రతి ఏటా వారి కుటుంబ సభ్యుల నుంచి విరాళాలను సేకరించి రమణారావు అందజేస్తుండేవారిని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం, సోషలిస్టు వ్యవస్థ నిర్మాణం కోసం నిరంతరం పనిచేసే రమణారావు ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం సిపిఎం కార్యకర్తల, ప్రజాసంఘాల సభ్యుల కర్తవ్యమని ఈ సందర్భంగా కృష్ణారావు అన్నారు.

విశాఖలో డెంగీ డేంజర్ బెల్

రాష్ట్ర కేసుల్లో 20 శాతం ఇక్కడే
నిద్రాణంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్రంలో అత్యధిక డెంగీ కేసుల్లో విశాఖ జిల్లాయే రికార్డు స్థానంలో ఉంది. కేసుల లోడు పెరుగుతున్నా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు నిద్రాణ స్థితిలోనే ఉండడం గమనార్హం. అత్యంత వేగంగా జనాభా పెరుగుతున్న నగరాల జాబితాలో విశాఖ ప్రథమ స్థానంలో ఉంది. చదరపు కిలోమీటరుకు అత్యధికంగా జనాభాగల నగరమిదే. సచివాలయ వ్యవస్థను ఎపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన తర్వాత సైతం వైద్య ఆరోగ్య సిబ్బంది పనితీరు మారలేదు. నానాటికీ తీసికట్టుగా ఉండడం కేసుల పెరుగుదలను పట్టిచూపుతోంది. రాష్ట్రంలోని 26 జిల్లాల్లోకీ విశాఖలో 965 కేసులు అత్యధికంగా అంటే 20 శాతంపైగా కేసులు ఇక్కడే వస్తుండడం 'డెంగీ డేంజర్ బెల్' మోగిస్తుందనడానికి తార్కాణం. విపరీతమైన కడుపులో నొప్పి, జ్వరం తదితర రుగ్మతలతో ఆసుపత్రులన్నీ కిటకిటలాడుతున్నాయి. సరైన వైద్య సాయం విశాఖ నగరంలో వార్డులు, వాడల్లో అందడం లేదు. ప్రైవేట్ ఆసుపత్రులకు అత్యధిక సొమ్మును సామాన్య ప్రజలు ఈ వ్యాధులతో కట్టబెట్టబెట్టాల్సి వస్తోంది.

కేసులు, వ్యాధుల నమోదు ఇలా..

రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల 79,531 పరీక్షలు జరగ్గా 5231 డెంగీ కేసులు బయటపడ్డాయి. డెంగీ పాజిటివిటీ రేటు రాష్ట్రంలోని 26 జిల్లాల్లో 6.5 శాతం ఉండగా విశాఖ జిల్లాలో 15 శాతానికిపైగా నమోదైంది. విశాఖ జిల్లాలో 6097 టెస్టులు జరపగా 965 పాజిటివ్ కేసులు బయటపడ్డాయి. నవంబర్ 13 వరకూ ఈ వివరాలు వైద్య ఆరోగ్య శాఖ ద్వారా వెల్లడయ్యాయి. 2021లో రాష్ట్రంలో 4760 కేసులు డిటెక్ట్ చేయబడ్డాయి. అయితే 2020-21లో కోవిడ్‌పై పూర్తిగా వైద్య ఆరోగ్య శాఖ పనిచేసింది. సరాసరి ఐదు వేలులోపే ప్రతి ఏటా ఉండే డెంగీ కేసులు పట్టణీకరణ, నగరీకరణ వల్ల పెరిగాయి. దీనికితోడు వైద్య ఆరోగ్య శాఖ పనితీరు సరిగాలేదు. డెంగీ ప్రమాదంపై సరైన ప్రచారం నిర్వహించలేదు. 'తిలాపాపం తలాపిడికెడు' అన్న చందాన గ్రేటర్ విశాఖ నగర పాలక సంస్థ (జివిఎంసి) పాత్ర కూడా దీంట్లో ప్రస్ఫుటంగా ఉంది. వార్డుల్లో స్ప్రే చేసే పని కానరాకుండా పోతోంది. దోమలను లార్వా దశలోనే నిర్మూలించాలంటే స్ప్రే అనేది పక్కాగా జరగాలి. ఇంటింటి సర్వేకు జనగణమన పలికినట్టు స్పష్టమవుతోంది. ఫ్రిజ్‌లు, పూల కుండీలు, ఆర్నమెంటల్ ప్లాంట్స్, నీటి డ్రమ్ములు డెంగీ, ఇతర వ్యాధికారక దోమల వ్యాప్తికి కారణంగా ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా చూసినప్పుడు 2015లో 3150 కేసులు మాత్రమే ఉండగా 2020లో మాత్రం అత్యల్పంగా 925 నమోదు అయ్యాయి. 2022 నవంబర్ 13 నాటికి 5200 పైచిలుకు పెరిగిపోయాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో చూసుకుంటే నవంబర్ 13 నాటికి అనకాపల్లిలో 1962 మందికి పరీక్షలు జరపగా 206 డెంగీ పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. అల్లూరి జిల్లాలో 1023 టెస్టులకుగానూ 39 కేసులు మాత్రమే వచ్చాయి. విశాలంగా ఉండే చోట కేసులు ఉండవనడానికి అల్లూరి జిల్లాయే తార్కాణం. నగరీకరణ పెరుగుతున్న విశాఖకు డెంగీ ముప్పు పొంచి వుందన్నది తాజా లెక్కల ద్వారా స్పష్టమవుతోంది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ఇతర ఆరోగ్యశాఖాధికారులు మేల్కొనకపోతే నగర ప్రజానీకం ప్రమాదంలో పడే అవకాశాలు కనిపిస్తున్నాయి.


జ్వరాలతో బాధపడుతున్న రోగులు

మా సమస్యలను పరిష్కరించండి

ఊబర్ కార్యాలయాన్ని ముట్టడించిన డ్రైవర్లు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఊబర్ డ్రైవర్ల సమస్యలను తక్షణం పరిష్కరించాలని విశాఖ క్యాబ్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు బి.జగన్, ప్రధాన కార్యదర్శి పి.శ్రీరాములు డిమాండ్ చేశారు. మంగళవారం యూనియన్ ఆధ్వర్యంలో ఊబర్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఊబర్ యాప్‌లకు విశాఖపట్నంలో 4 వేల మంది లింకై ఉన్నారన్నారు. యాజమాన్యం ఏడు సంవత్సరాల నుంచి క్యాబ్ డ్రైవర్లను అనేక ఇబ్బందులకు గురి చేస్తోందని తెలిపారు. గతంలో డిటిసి దగ్గర అంగీకరించిన అంశాలను కూడా అమలు చేయకుండా వ్యవహరిస్తున్నారన్నారు. దీంతో కారు ఓనర్లు, డ్రైవర్లు ఇబ్బందులు పడుతూ ఏదైనా సమస్య వస్తే ఎవరితో మాట్లాడాలో కూడా చెప్పుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. ఊబర్ మేనేజ్‌మెంట్‌కి సంబంధించి ఎవ్వరూ వైజాగ్‌లో ఉండటం లేదన్నారు. డ్రైవర్లకు సమస్య వస్తే ఎవరితో చెప్పుకోవాలో దిక్కు తోచని స్థితిలో ఉన్నారన్నారు. ఇక్కడ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించగలిగే మేనేజ్‌మెంట్ తమకు కావాలన్నారు. ఊబర్ రైడ్‌పై కమిషన్ చట్టం ప్రకారం 20 శాతం మాత్రమే తీసుకోవాలన్నారు, అయితే 40 శాతం వరకు తీసుకుంటున్నారని, ఇది అన్యాయమని అన్నారు. ఊబర్ కస్టమర్ బుకింగ్ యాప్‌లో కస్టమర్‌కి క్యాబ్ మాత్రమే చూపించాలన్నారు. ఊబర్ కస్టమర్ యాప్‌లో క్యాబ్, ఆటో, బైక్ చూపిస్తున్నారని చెప్పారు. డ్రైవర్‌పై కస్టమర్ ఫిర్యాదు చేస్తే వైజాగ్‌లో ఉన్న ఊబర్ కార్యాలయానికి డ్రైవర్‌ను పిలిచి విచారణ చేసిన తరువాత మాత్రమే అతని మీద చర్యలు తీసుకోవాలన్నారు. నైట్ ఫెయిర్స్ 50 శాతం ఇవ్వాలని, అవుట్ స్టేషన్ రేట్లు పెంచాలని కోరారు. ఊబర్ మేనేజర్ యశ్వంత్‌ను తొలగించి డ్రైవర్ల సమస్యలను పరిష్కరించగలిగే మేనేజర్ కావాలన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు సిహెచ్.శ్రీనివాస్, కమిటీ సభ్యులు పోలి నాయుడు, అబ్బాయి, శ్రీనివాస్, శ్రీను, ప్రసాద్, లక్ష్మీ నారాయణ, శరత్, అప్పలరాజు, ఆనంద్, శివ, పెద్ద సంఖ్యలో డ్రైవర్లు పాల్గొన్నారు.


ఏజెన్సీ పర్యటనకు వచ్చిన జర్మనీ దేశస్తులు

ఎఒబిలో జర్మనీ దేశస్తుల పర్యటన

ప్రజాశక్తి-సీలేరు : ఆంధ్ర ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో జర్మనీ దేశస్తుల బృందం మంగళవారం పర్యటించారు. గిరిజన ఆచార సాంప్రదాయాన్ని అద్దం పట్టేలా స్థానికులు జర్మనీ దేశస్తులకు స్వాగతం పలికారు. వారిని వివిధ రూపాల్లో అలంకరణ చేశారు. ఎఒబిలోని రాసపేట గ్రామానికి సందర్శించారు. అక్కడ గిరిజనులతో సమావేశమై వారి ఆచార సంప్రదాయాలను అడిగి తెలుసుకొని మంత్రముగ్దులయ్యారు. పచ్చని కొండల నడుమ సుందర దృశ్యాలను తిలకించారు. అనంతరం సీలేరు పాస్టర్ ఫెలోషిప్, యునైటెడ్ చర్చి ఫెలోషిప్ సంజీవ్‌రావు సౌజన్యంతో సింగయ్య ఆధ్వర్యంలో 250 మంది బీద రాచబేడ గ్రామం గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీలేరు పాస్టర్ మనసై, బచ్చులూరు పాస్టర్ డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

అచ్చియ్యమ్మ ఆత్మహత్యపై సమగ్ర విచారణ

ప్రజాశక్తి - పెందుర్తి, కలెక్టరేట్ : పెందుర్తి మండలం ముదపాక పంచాయతీ గోవిందపురం గ్రామంలో కడియాల అచ్చియ్యమ్మ ఆత్మహత్య చేసుకొని చనిపోయిన సంఘటనపై పోలీసులు సమగ్ర విచారణ జరిపి, ఆమె మరణానికి కారకులైన దోషులను కఠినంగా శిక్షించాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.జగన్, పెందుర్తి జోన్ కార్యదర్శి బి.రమణి మంగళవారం డిమాండ్ చేశారు. ఇదే కుటుంబంలో రెండు నెలలు క్రితం సారిపల్లి సోమేశ్వరరావు ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. రెండు సెంట్లు భూమి కోసం వైసిపి ప్రభుత్వం చేస్తున్న అరాచకం వల్ల కోర్టులో వివాదం నడుస్తోందని తెలిపారు. కోర్టు ఆదేశాల మేరకు స్థానిక అధికారులు నోటీస్ ఇవ్వడంతో అచ్చియ్యమ్మ ఆందోళనకు గురైందన్నారు. మరోవైపు వైసిపి నాయకుల వేధింపులు కూడా కారణమయ్యాయన్నారు. ఈ ఆత్మహత్య సంఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ పెందుర్తి సిఐకి వినతిపత్రం అందజేశారు. నిందితులపై ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు లావణ్య, అనంతలక్ష్మి, అప్పలనాయుడు, సింహాచలం పాల్గొన్నారు.

జన జాగృతి పాదయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఉత్తరాంధ్ర బిసి సంఘాల కన్వీనర్ డాక్టర్ సనపల లక్ష్మీ నరసింహ ఆధ్వర్యంలో ఉత్తర నియోజకవర్గంలోని బిసిల మేలు కోరుతూ డిసెంబర్ 14 నుంచి మొదలు పెడుతున్న జన జాగృతి పాదయాత్ర పోస్టర్‌ను మంగళవారం ఉదయం వైసిపి కార్యాలయంలో జివిఎంసి మేయర్ హరి వెంకట కుమారి ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బిసిల అభ్యున్నతికి లక్ష్మీ నరసింహ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.

పరిశుభ్రతపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఈ నెల 14 నుంచి 20 వరకు జరుగుతున్న అంతర్జాతీయ బాలల హక్కుల వారోత్సవాలలో భాగంగా చైల్డ్ రైట్స్ అండ్ యు (క్రై) సంస్థ, స్టే ఫ్రీ సహకారంతో రూపొందించిన మెన్స్ట్రు పీడియా పుస్తకాన్ని ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో కౌమార బాలికలకు వారి హక్కులు, ఆరోగ్యంపై అవగాహన కల్పించవలసిన అవసరం ఎంతైనా ఉదన్నారు. ధరణి సోషల్ వెల్ఫేర్ సొసైటీ కార్యదర్శి బి.హరి వెంకట రమణ మాట్లాడుతూ గ్రామాలు, వార్డులలో పిల్లల బహిష్టు పరిశుభ్రతపై అవగాహన కల్పించేలా ఈ పుస్తకాన్ని బెంగళూరుకు చెందిన చైల్డ్ రైట్స్ అండ్ యు (క్రై) సంస్థ రూపొందించిందని తెలిపారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త కెవిఎస్.నరసింహం, ధరణి సంస్థ కమ్యూనిటీ ఆర్గనైజర్లు కృష్ణ కుమారి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.